# జామా రబ్

అద్భుతంగా పనిచేసే ఆదాయకరమైన పెయిన్ బామ్ ★ తలనొప్పి ★ జలుబు ★ దగ్గు ★ బెణుకులు ★ కండరాల నొప్పి-వెంటనే ఉపశమనం.

**వర్వదా ఒక సీసా దగ్గర వుంచుకోండి.**

ప్రతిచోట లభ్యమౌతుంది.

**అమర్‌చంద్ సోభాచంద్**

మద్రాసు-3.



EP-AS-8

చిత్రకళను తెలుగుభాషలోనే నేర్చుకోనండి



స్థాపితం : 1957.

హైద్రాబాద్ హోమ్ సైన్స్ కాలేజి హాస్టల్‌లో నివసించు మన విద్యార్థిని కుమారి టి. విజయలక్ష్మిగారు వ్రాయుచున్నారు. "తమరు పంపిన డిప్లొమా చేరినది. సంతోషము. తమ విద్యాలయముయొక్క మిక్కిలి ప్రఖ్యాతిగాంచిన పాఠముల మూలముగా నేను చిత్రకళయందు బాగుగా వుత్తీర్ణురాలనైతిని.

మీరు కూడా ప్రఖ్యాత చిత్రకారులవ గోరుచున్నారా?

ఇంగ్లీషు, తమిళము, తెలుగు భాషలలో మీకు నచ్చిన భాషలో చదువవచ్చును.

వివరములకు : 40 పైసా. స్టాంపులు పంపండి.

**SANTHANU'S ART INSTITUTE,**
**C/O. Chitrakullan, Madras-2.**


మరొకరు ఎవరికీ తన అవసరం లేదన్న భావం ఎవరికీ ఆరోగ్యప్రదం కాదు. వైముఖ్యం జనించి,ఘనీభవించడానికి కారణం అవుతుందది. తోడివారిపట్ల నిరసన కలిగిస్తుంది. ఒకప్పుడు ఎప్పుడైనా ఇతరుల అవసరం ఏర్పడినా అలాంటిది లభ్యం కావడానికి ప్రతిబంధకంగా నిలుస్తుంది.

---

"హలో! కమలం! కమాన్..." ఇంట్లో ప్రవేశిస్తూనే కేకవేసి కుర్చీలో కూలబడ్డాడు అతను, ఒక చేతిలో కాఫీ, ఒక చేతిలో ఉప్మాతో వస్తూన్న కమలాన్ని చూసి.

"పాల కడలినుండి ఉదయిస్తూన్న మహా లక్ష్మిలా ఉన్నావు, కమలం!" అన్నాడు. కమలం సుందరంగా నవ్వి చేతిలోవి బల్లమీద పెట్టి అతని బూట్లు విప్పింది. నుదుటిపైన చెమట పమిటచెంగుతో ఒత్తింది. ఉప్మా తింటూన్న అతనికి ఇల్లంతా ముగ్గులతో కొత్తగా కనిపించడంతో, "ఇవాళ ఏమిటి విశేషం చెప్మా!" అన్నాడు తనలో తను అనుకుంటున్నట్టుగా.

"ఏమిటో మరి" అంది కమలం.

"చెప్పవా?"

"చెప్పుకోలేరా?"

ఎంత ఆలోచించినా తోచని అతను, "ఊహూఁ" అన్నాడు.

"రేపు శ్రీవారి పుట్టిన రోజటు!" అంది.

"నిజమే!" అని అతను ఆశ్చర్య పడుతూండగానే లోపలికి వెళ్ళి కొత్తబట్టలు తెచ్చి చూపించింది. అతను ఆనందంలో అమాంతం కుర్చీలోంచి లేచి, "కమలం! నువ్వు లేకపోతే నా పుట్టిన రోజునే కాదు నన్ను నేనే మరిచిపోయేవాణ్ణి సుమా! నీ ఋణం ఎలా తీర్చుకోను, కమలం! ఎలా తీర్చుకోను?" అంటూ కమలం తలను రెండు చేతులతోనూ లాక్కున్నాడు.

కమలానికి మత్తుగా తియ్యగా ఉంది. తనులేకపోతే అతను బ్రతకలేడు. తను అందించకపోతే టూత్ బ్రష్ కనిపించదు; తువ్వాలు కనిపించదు; దువ్వెన కనిపించదు; పెన్ను కనిపించదు; బొత్తాలు కనిపించవు; అసలు తనే కనిపించడు! అతను ఇంటి దగ్గర ఉన్నంత సేపూ తను ఉండాలి. అతను ఇంటికి వచ్చేసరికి తను కనిపించాలి. ఎంత అదృష్టం! ఈ లోకంలో తను లేకపోతే ఒక మనిషి బ్రతకలేడు. ఒక ఇల్లు లేదు. ఒక వెలుగు లేదు. ఎంత అందమైన బాధ్యత! ఎంత ఆనందమైన బరువు!

* * *

కొత్త పెళ్ళికూతురి ముస్తాబులో, గదిలో కూర్చొని, అరమోడ్పు కన్నులతో కమ్మగా కలలు కంటూన్న కమలానికి, "కొత్త కోడలు ఎక్కడుంది, పిన్నిగారూ" అని ఎవరో అడుగుతూండడం వినిపించింది. ఒక వ్యక్తి గదిలో ప్రవేశించడమూ కనిపించింది. ఆవిణ్ణి చూసి అప్రయత్నంగా లేచి నిలబడిన కమలంతో, "నేను ఎదురింటి ఇల్లాలు శారదనమ్మా! సుబ్బమ్మ గారి కొత్త కోడలిని చూడడానికి వచ్చాను" అంటూ కమలాన్ని కూచోబెట్టి పక్కనే తనూ కూచుంది. ఆవిడ మాటలకు కమలం సిగ్గుపడుతూంటే గడ్డం పట్టుకుని మొహం ఎత్తి, "కలలుకంటూ, సిగ్గుపడుతూ కూర్చుంటే బ్రతుకులు బాగుపడవు. మెలకువగా, తెలివిగా దిద్దుకోవాలమ్మా!" అంది. స్వరంలోని హెచ్చరిక వింటూంటే కమలానికి ఏదో భయం వేసింది. భయంలేదన్నట్టుగా వెన్నుమీద రాస్తూన్న శారదను విచిత్రంగా చూసింది కమలం.

అతెలు-అనేక విచిత్రానుభవం. ఎన్నడూ ఎరగని కొత్త అనుభవం. తన బ్రతుకును గురించిన ఆలోచన ఒక మనిషికి ఉండడం కొత్తగానే ఉంది.

అన్నయ్య పుట్టిన రెండేళ్ళకు అక్కయ్య పుట్టగా, అక్కయ్య పుట్టిన పన్నెండేళ్ళకు కమలం పుట్టింది. పన్నెండేళ్ళ ఎడమైన కాన్పు తల్లికి గండమైపోయింది. దొడ్డికి వెళ్ళితే కడగడానికి, స్నానం చేస్తే చొక్కా వెయ్యడానికి విసుక్కుంటున్న అక్కయ్యను చూసి, "మీ బిడ్డ మీకే బరువైతే, కూలికి వచ్చినదాన్ని నాకేంటమ్మా తెలిసా?" అని వంటను పెట్టుకున్న ముసలమ్మ సణుక్కునేది.

వయస్సు ఇచ్చిన జీవితంలో పడి అక్కయ్య, అన్నయ్య ఎవరి గొడవలు వాళ్ళు పడుతూంటే అయిదేళ్ళ కమలం చెట్లతోనూ, పిట్టలతోనూ ఏదేదో మాట్లాడుకుంటూ గడిపేది. ఎప్పుడూ క్యాంపులలో తిరుగుతూండే తండ్రి ఏనాడూ కమలాన్ని బరువుగాగాని, కరువుగాగాని చూసుకోలేదు.

పెళ్ళి అయ్యాక అత్తారింటికి వెళ్ళిపోతున్న అక్కయ్య, పదేళ్ళ కమలాన్ని తలచనైనా తలచకుండా బండి ఎక్కేస్తూంటే, 'అవును! అక్కయ్యకు నేనెందుకు!' అనుకుంది.

ఉద్యోగపు ఊరికి భార్యతో వెళ్ళిపోతూ, "నాతో వస్తావా, కమలం?" అని అన్నయ్య అడుగుతూంటే—

"క్యాంపడీసి వెంటబడుతుందేమిటి చెప్మా!" అన్న భావం అందులో విన్న కమలం—

'అవును. అన్నయ్యకు తను ఉండి తీరవలసిన కర్మేమిటి?' అనుకుంది బరువుగా.

ఎప్పుడూ క్యాంపులమీద తిరిగే తండ్రి కమలాన్ని ఎక్కడ ఉంచడమో తెలీక చిరాకు పడుతూంటే,—

'నాన్నకు మాత్రం తను లేకపోయినంత మాత్రాన వచ్చిన నష్టమేముంది?' అనుకుంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

తండ్రి అడిగినదానికి సమాధానంగా అన్నయ్య దగ్గిరా, అక్కయ్యదగ్గిరా తప్ప ఇంకెవరి ఇంట్లోనైనా తనను ఉంచమని చెప్పింది.

అందుకే పిల్లలున్న పిన్నికి సాయంగా ఉంటుందని చిన్నాన్నగారి ఇంట్లో తెచ్చిపెట్టారు.

కాని ఏనాడూ ఆవిడకు మనఃపూర్తిగా సాయం చేయలేదు కమలం. "లేనిపోని తద్దినం నా నెత్తిన పెట్టారంటూ" సణుక్కుంటూండే పిన్ని కమలం లేనప్పుడు ఎలాగో ఒకలా చేసుకుంటూనే ఉంది. తను చెయ్యనంత మాత్రాన అక్కడ ఆగిపోయే పనేంలేదని కమలానికి తెలుసు. తన బాధ్యత కానిది, తను చెయ్య

## పి. సరళాదేవి


తొణికిన
స్వప్నం

## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# పరాభవ దీపావళి కథల పోటీ

## 2,500 రూపాయల బహుమతులు

ప్రతి ఏడాదివలెనే పరాభవ దీపావళి సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తున్నది.

విశ్వావసు దీపావళికి నిర్వహించిన కథల పోటీలో 2,000రూపాయల బహుమతులు ఇచ్చాము. రచయితలకు, రచయిత్రులకు ఇతోధికమైన ప్రోత్సాహం ఇచ్చే నిమిత్తం ఈ ఏడాది దీపావళి పోటీకి 2,500 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలు, రచయిత్రులు ఈ అవకాశం వినియోగించుకొంటారని, పాఠకులకు ఉత్తమమైన కథలు అందచేయాలనే మా పూనిక విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలని కోరుతున్నాము.

**మొదటి బహుమతి : 1,000**
**రెండవ బహుమతి : 700**
**మూడవ బహుమతి : 500**

**రెండు కన్సొలేషన్ బహుమతులు: చెరొక 150**

### దీపావళి కథల పోటీ నిబంధనలు :

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయరచనలే కాని అనువాదాలు పంపరాదు.
3. రచన పుల్‌స్కేపు సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒక పక్కన వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. పోటీకి పంపిన కథలు ఏ సందర్భం లోనూ తిప్పి పంపబడవు.
8. రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు –2' కు పంపాలి.

**బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము**

**పరాభవ దీపావళికథల పోటీకి రచనలు మాకు చేర వలసిన ఆఖరి తేది**

**1966 ఆగస్టు 31**

## తొణికిన స్వప్నం

సంతవరకూ ఆగిపోలేనిది—అది కాదు కమలానికి బాధ కలిగించింది.

ఇక్కడికి వచ్చాక కమలం చదువును గురించి ఎవరూ ధ్యాస పడలేదు. ఎప్పుడో చూడడానికి వచ్చినప్పుడు, చిన్న చిన్న ఇంగ్లీషు పుస్తకాలు తెచ్చి ఇచ్చేసి, "ఇవి చదువుతూ ఉండు ఇంగ్లీషు అభివృద్ధి అవుతుంది" అనేవాడు తండ్రి. అంతటితో తన బాధ్యత తీరిపోయిందనుకునేవాడు. "చదివావా?" అని కనీసం ఎప్పుడైనా ఎవరైనా అడిగితే ఎలా ఉండేదోగాని కమలం వాటి వంకైనా చూడలేదు.

తను చదవకపోతే పీకలేని పుస్తకాలు లేవు. తను చెయ్యకపోతే ఆగిపోయే పనులు లేవు. తను లేకపోతే బతకలేని మనుష్యులు లేరు. ఎప్పుడూ తన జీవితాన్ని గురించిన భావాలు లేవు.

ఆ నిజం తెలిసినప్పుడల్లా కమలం కుమిలిపోయేది. ఒంటరిగా గడపడం అలవాటయిన కమలం, ఆకాశంలో చందమామను చూసీ, గాలికి ఊగాడే చెట్లను చూసీ, తల్లి పెట్టే తిండి తింటున్న పిట్టలను చూసీ ఎన్నెన్నో కలలు కనేది. తను చెయ్యకపోతే ఆగిపోయే ఇల్లును గురించి, తను లేకపోతే బ్రతకలేని భర్తను గురించి, తనను చూడకపోతే ఏడ్చే పిల్లలను గురించి బంగారు కలలు కనేది.

• • • •

అంత అందమైన ఆశతో అత్తవారింట అడుగుపెట్టిన కమలానికి శారద హెచ్చరిక భయమూ కలిగించింది. ఆవిడ ఆప్యాయత తృప్తినీ కలిగించింది.

కమలం కలలోనయినా కోరని పాడీ పంటా సమృద్ధిగా ఉన్నాయి ఆ ఇంట. "అల్లుడుగారు ఏంచేస్తూంటారండీ?" అని ఎవరైనా అడిగితే, "ఆస్తులు చూసుకుంటూంటారు" అని తండ్రి చెప్పిన సమాధానం ఇక్కడకు వచ్చాక బోధపడింది కమలానికి.

ఎంత బరువైన బాధ్యత అయినా సరే వహించి, సంసారమంతా చక్కబెట్టుకుందామనుకున్న కమలానికి ఇక్కడ చేసేందుకు పనేమీ కనిపించలేదు. ఒక పక్క వంట, పెట్టు చేసుకుంటూ, ఇంకో పక్క ఇంట్లో పనులు, పొలం వ్యవహారాలు అతి చకచక్యంగా చేసుకుంటూండే అత్తగారికి కొంచెం బరువు తగ్గిద్దామని ప్రయత్నించింది కమలం. కాని ఏ పని చెయ్యబోయినా, "ఎందుకులేమ్మా! నేను చేసుకుంటానులే. నువ్వు వెళ్ళు" అనేసేది అత్తగారు. భర్తకి కనీసం భోజనమైనా వడ్డిద్దామనుకొంది. కాని, "వాడికి నా చేతులతో నేను పెడితేగాని తృప్తి ఉండదు. ఏదో ఈ ఘటం ఉన్నన్నినాళ్ళూ ఇలా జరిగిపోనివ్వమ్మా" అంటున్న సుబ్బమ్మగారిని చూసి ఆమె తృప్తిగానే వదిలిపెట్టింది.

ఏ జీవితమైనా గట్టిగా పట్టుకొని తనది చేసుకుంటేనే తప్ప చూస్తూ ఊరుకుంటే దేనికదే జారిపోతుందని తెలిని కమలం నిట్టూర్చడం మాత్రం నేర్చుకొంది.

భర్త ఇస్తున్న ఆనందంలో మిగతాదంతా తేలిగ్గా

తీసుకున్న కమలం, ఆ ఆనందం క్షణభంగురమని, తన బంగారు కలలు పండడానికి బదులు ఎండబోతున్నాయని తెలుసుకోబోయే సరికి సరిగ్గా నెల రోజులు దాటింది. ఆ విషయం అతి విచిత్రంగా కమలానికి అవగాహన అయింది.

ఒక రోజు సాయంత్రం సుబ్బమ్మగారు కమలానికి జడవేస్తూ ముస్తాబు చేస్తూంది. ఆ సమయానికి ఆనందరావు గదిలో కూర్చుని కులాసాగా కూని రాగాలు తీస్తున్నాడు. అంతలో పన్నెండేళ్ల కుర్రాడు గబగబా లోపలికి వచ్చి, "బావగారూ" అని కేకవేశాడు. ఆనంద రావు బయటికి రాగానే, "అక్క మిమ్మల్ని తీసుకు రమ్మందండీ" అన్నాడు.

ఆనందం తటపటాయించడం చూసి, "మిమ్మల్ని తీసుకురాకుండా వస్తే నాకూ తలుపు తియ్యనండండీ. రండీ" అన్నాడు మళ్లా. ఆనందం ఒక్క క్షణం ఆలోచించి కమలంవక్క చూసి ఒక్క నవ్వు నవ్వేసి ఆ అబ్బాయితో వెళ్లిపోయాడు.

ఇదంతా చూస్తున్న సుబ్బమ్మగారు వేస్తూ వేస్తూన్న జడ వదిలేసి, "ఇంకెందుకులే, తల్లీ, ఈ సింగారం" అంటూ లేచిపోయింది. ఇదేమీ అర్థంకాని కమలం జడ పూర్తి చేసుకుని, పెరట్లో సన్నజాజిపూలు కోసుకోడానికి వెళ్లబోతూ, ఎవరితోనో చెబుతున్న అత్తగారి గొంతు విని ఆగిపోయింది.

"అదెక్కడ తగులుకుందోగాని పెళ్లయి నెలన్నా కాలేదు. అప్పుడే రెక్కట్టుకు లాక్కెళ్లిపోయింది. మా తల్లి! వీణ్ణి తినేసేటట్టుంది. పెళ్లి చేస్తే నన్నా వదులుతా డనుకున్నానమ్మా. మా కోడలు వాజమ్మకు ఆపాటి చాతనయినట్టు లేదు. ఇదంతా నా ఖర్మ" అంటూన్న అత్తగారి మాటలు విని తన నెత్తిమీద ఏ గద్దో బలంగా తన్నినట్టు దిమ్మెరపోయింది కమలం.

ఆ రాత్రి అంతా అయోమయంలో గడిపింది. రెండు రోజుల వరకూ ఆనందం రాలేదు. మూడవ రోజు అతను వచ్చేసరికి, సుబ్బమ్మ గారు గబగబా తన దగ్గిరికి వచ్చి, "వెళ్లమ్మా. వెళ్లి చీరా గీరా మార్చుక ని వాడికి కావలసిన వేవో చూడు. వాడు మళ్లీ దాని గుమ్మంలోకి వెళ్లకుండా ఆకట్టుకో. ఏదో మీ ఇద్దరూ ఖర్మగా ఉండి మీ కడుపున ఓ నాలుగు కాయలు కాస్తే అంతకన్నా ఇంకేం కావాలి నాకు?" అనడం వినిపించింది.

ఏడవాలో, నవ్వాలో, సిగ్గుపడాలో తెలియని ఆ పరిస్థితిలో దుఃఖంతో కళ్ల నీళ్లు తిరిగాయి కమలానికి. ఇటు చూస్తే అత్తగారు, అటు చూస్తే భర్త. తెలిసీ తెలియని వయస్సు. అర్థమయీ అర్థంకాని పరిస్థితి.

స్నానంచేసి పాలమరుగులాంటి తెల్లని చీర కట్టుకుని కాఫీ పట్టుకుని గదిలోకి వచ్చింది. ఆనందం తలకింద చేతులు పెట్టుకుని మంచంమీద పడుకుని దూలాలు లెక్కపెడుతున్నాడు.

"కాఫీ" అంది మెల్లిగా.

"నా పేరు కాఫీ కాదే" అన్నాడు ఇటు తిరగకుండా. కమలానికేదో భయంగా ఉంది.

"కాఫీ తీసుకోండి" అంది మెల్లిగా గొంతు పెగుల్చుకుని. ఆనందం బోర్లా తిరిగి మోచేతులమీద లేచి కప్పు అందుకుంటూ, "బరోడా రాణిలా ఉన్నావు" అన్నాడు. బెదురుతూ బెదురుతూ కళ్లెత్తిన కమలాన్ని గబుక్కున లాక్కుని, "ఎందుకలా బెదురుతావు? నిన్నేం కాదనలేదుగా" అన్నాడు.

ఆ మాట కర్థం మరో మూడు రోజులకుగాని కమలానికి తెలియలేదు. అప్పటికిగాని అత్తవ చేసిన హెచ్చరికా అర్థం కాలేదు. ఆ సరికి ఆనందం మళ్లీ వెళ్లిపోయాడు.

"కొత్త మోజులోనే ఆకట్టుకోలేని ఆడదానివి పాతబడితే నీ మొహమైనా చూస్తాడటే! ఎంత జాణవు కాకపోయినా ఇంత వాజమ్మవని అనుకోలేదే!" అంటూ సుబ్బమ్మగారు సాధిస్తూంటే ఇంకా ఆశ ఉన్న కమలం బాధపడలేదు.

ఈసారి ఆనందం వచ్చిఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా శృంగారంగా అలంకరించుకోసాగింది. వారం రోజుల వరకూ అతను ఎక్కడికీ కదలలేదు. ఉన్నట్టుండి ఒక రోజు వెళ్లే ప్రయత్నం చేస్తూంటే, కమలం ధైర్యం చేసి దగ్గిరికి వెళ్లి భుజంమీద తల వాల్చింది. అతను దగ్గిరికి తీసుకుని నెమ్మదిగా హత్తుకుని వదిలేశాడు.

అయినా కమలం వదలలేదు. అతని చెయ్యి తన నడుముచుట్టూ తిప్పుకుని గుండెలమీద తల వాల్చి కళ్లు మూసుకుంది. ఆమె ప్రయత్నాలు చూసి ఆనందం నవ్వాడు.

"మొత్తానికి గడుసుదానివే, కమలం. కాని నన్ను ఆపడానికి ప్రయత్నించకు. చాల నష్టపోతావు" అన్నాడు.

ఇంతకన్నా తను నష్టపోయేదేమిటో కమలానికి తెలియలేదు. తను కేవలం ఆ ఇంట్లో కులవింటి కోడలే తప్ప ఇంకేమీ కాదు. తన భర్త శారీరికావసరానికి కూడా కేవలం తను ఒక్కతే లేదు. ఈ భావం నర నరానా కమలాన్ని బాధిస్తూంది.

ఏంచేస్తే తనకు కావలసినవి పొందగలదో కమలానికి తెలియలేదు. యాగీచేసి, ఏడ్చి గొడవచెయ్యడం చిన్నప్పటినుండీ అలవాటు లేదు. అది కమలం ఇష్టం కూడా కాదు. అలా చేసి తను పొందేదేమీ లేదన్న సంగతి కమలం గ్రహించుకుంది.

మనస్సులోని ఈ చికాకుతోపాటు ఒంట్లో కూడా ఏదో కొత్త చికాకు ప్రారంభం అయ్యేసరికి సుబ్బమ్మ గారు దానికి వేవిళ్లు అని నామకరణం చేసింది. ఈ మాట వినగానే హఠాత్తుగా కమలానికి కొత్త ఆశ స్ఫురించింది. కొత్త ఆనందం సంతరించుకుంది.

ఈ సారు ఆనందం వచ్చినప్పుడు మరింత హడావిడి పడిపోయింది. 'ఈ అనుబంధానికి అయినా అతను కట్టుబడడా?' అనుకొంది.

ఆ రాత్రి సిగ్గుపడుతూ చెప్పింది—

"మనకు పాపాయి వస్తాడు" అని. ఆనందం నవ్వుతూ కమలం మొహంలోకి చూస్తూ, "అయితే అయిదారు నెలలు నీ నుండి నాకు సెలవు లభిస్తుందన్నమాట" అన్నాడు.

ఆ మాట వింటూనే వాడిపోయింది కమలం. మరి ఇంకేం మాట్లాడకుండా మంచందిగి చాప తీసుకుని కింద వేసుకుని పడుకుంది. ఆనందం ఏమీ అభ్యంతరం చెప్పలేదు.

* * *

ఆడదిక్కులేని తను కమలాన్ని తీసుకువెళ్లి పురుడు


# ఇంకా పొడుగు ఎదగండి



నూతన శాస్త్ర పద్ధతులతో, వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి, ఆరోగ్యవంతులు కండి. స్త్రీ, పురుషులకు ఎల్లరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి లేదు. వివరములు ఉచితం.

**TOTAL HEALTH**
Azad Market (A.P.V.)
Delhi-6.





ఒత్తుగా మెత్తగా నిగనిగలాడే
సుదీర్ఘ కేశసంపదకు
కేశవర్ధిని
పెట్టింది పేరు
కొబ్బరినూనెతో తిరిగి కలప నవసరం
లేకుండా వాడడానికి
కేశవర్ధిని
రెడీమిక్స్‌డ్ హెయిల్
మీ శిరోజాలను పరిమళ
భరితంగా ఉంచడానికి
కేశవర్ధిని షాంపూ




కేశవర్ధిని ప్రాడక్ట్స్
మానిలా మణి: మొదలియార్ రోడ్,
మద్రాసు-14.

పోషించలేనని, ఇక్కడే ఆ ఇక్కట్లు గట్టెక్కించమని తండ్రివచ్చి సుబ్బమ్మగారిని కోరిననాడు కమలం ఆశ్చర్య పడలేదు. ఆనాటికి తన దిక్కులేనితనం కమలం గుర్తించింది.

తను బతికిఉండగా కోడలికి ఇంటి బాధ్యత అప్ప జెప్పని అత్తగారూ, తను ఉన్నా లేకపోయినా సర్వ సౌఖ్యాలూ అనుభవిస్తూండే భర్తగారూ, వీరి మధ్య తన అల్పత్వం, అసహాయత్వం గుర్తించిన కమలం శారదతో చెప్పుకుని ఏడ్చింది. అణువైనా మిగలని తన బంగారు కలలు మట్టిపాలు అవుతూంటే చూస్తూ దిక్కుమోహంతో నిలుచుంది.

బతుకుపట్ల చెప్పరాని నిర్వేదం కలిగిన కమలం ఆస్పత్రిలో మగపిల్లాణ్ణి కన్నది.

ఆ నీరసంలో, ఆ వైరాగ్యంలో బిడ్డ ఆలనా పాలనా సుబ్బమ్మగారికే వదిలివేసిన కమలం, బిడ్డనే వదులుకుంటున్న సంగతి తెలుసుకునేసరికి పదినెలలు నిండాయి.

అప్పటికి ప్రాణంటి శారద చచ్చిపోయి నెలరోజులు అయిపోయింది. మూడవ పురుడు ఇంట్లో పోసుకో కూడదని తల్లినే దక్కరికి పిలిపించుకున్న శారద ప్రాణం లేని బిడ్డను కని ప్రాణం వదిలేసింది.

తనను అభిమానించే ఒక్క జీవి అలా అర్థాంతరంగా వెళ్ళిపోయేసరికి కమలానికి బతుకే మూగపోయి నట్లు అనిపించింది. మతిపోయినదానిలా శారద ఇంట్లో తిరుగుతూ, ఆమె ఇద్దరు పిల్లలకూ అన్నం పెడ్తూ చూడసాగింది. ఇదే అదనుగా ఆ పిల్లలూ అమ్మమ్మను చెయ్యనివ్వకుండా కమలంచేతే చేయించుకునే వారు.

“మాకు అన్నం పెట్టడానికి ఎవరూ లేరని దేవుడికి తెలీదా, పిన్నీ? అమ్మను తీసుకెళ్ళాడు కదా” అని అడిగేది పాప.

“మరి అమ్మ వచ్చేవరకూ నువ్విక్కడే ఉండిపో, పిన్నీ” అంటూ కొంగు పట్టుకుని తిరిగేపాప, “అమ్మ అమ్మ” అంటూ ఇంకేమీ మాటాడ్డంచాతకాక చేతులాడి స్తూండే బాబు కమలాన్ని ఏవో లోకాలలోకి తీసుకు వెళ్ళారు.

అలా శారద పిల్లలు తన చుట్టూ తిరగడంతో తెలివివచ్చిన కమలానికి తన కొడుకు జ్ఞాపకం వచ్చాడు. వాణ్ణి లాలించడానికి ప్రయత్నించసాగింది.

వాడికి అన్నం పెట్టాలనీ, నీళ్ళు పొయ్యాలనీ, ఎత్తుకు తిప్పాలనీ ఎంత ప్రయత్నించినా వాడు కమలం చేతుల్లోంచి జారిపోయి సుబ్బమ్మగారి పక్కకే పాకుతున్నాడు. “వీడూ తనకు కాడా?” అన్న బాధ కమలాన్ని దొలవ సాగింది.

ఒకసారి బంతితో ఆడుతూ ఆడుతూ పాతకాలం నాటి నిలువుటద్దాన్ని పగలగొట్టేశాడని కమలం కొడుకును గట్టిగా కోప పడింది.

వెంటనే సుబ్బమ్మగారు వచ్చి వాణ్ణి చంకనేసుకుని, “ఎందుకే వాడిమీద అలా విరుచుకు పడతావు? చిన్న వెధవ. తెలీక ఏదో చేశాడు. దానికే కొంప మునిగిపోయి నట్టు అరుస్తున్నావు. అయినా వాడిల్లూ వాడిసామానూ— ఏమైనా చేసుకుంటాడు. మధ్యనువ్వూ నేనూ ఎవళ్ళం?” అంటూ వాడిమీద కమలానికేమీ హక్కు లేదన్నట్టుగా వెళ్ళిపోయింది.

ఎంత పచ్చి నిజం! తనెవరూ? మధ్యలో వచ్చి మధ్యలో పోయేది! నిమిత్తమాత్రురాలు. అసలు తనకేం హక్కుంది? కూతురుగా, స్త్రీగా, తల్లిగా తనకెక్కడ హక్కుంది? ఏమి హక్కుంది?

కమలం హృదయం కోపంతో మండిపోయింది. దుఃఖంతో ఏడవసాగింది. బాధతో విరిగిపోయింది.

గబగబా శారద ఇంటికి వెళ్ళి మధ్యాహ్నం నిద్ర తీస్తున్న పిల్లలిద్దరి మధ్యా చోటుచేసుకు పడు కుంది కమలం. తన అవసరం ఇక్కడ ఉంది, ఇక్కడే ఎందుకు ఉండిపోకూడదూ? ఇంతకన్నా తన కక్కడ దొరికిందేమిటి? ఇంతకన్నా తనక్కడ మిగిలిందేమిటి? తనిక్కడే ఉండిపోతుంది. ఇక్కడే...

“అమ్మ, అమ్మ” అంటూ తన మెడ వాటేసు కున్న బాబు—

“మా అమ్మలాగే నువ్వుకూడా ఎంతో మంచిదానివి, పిన్నీ” అంటూన్న పాప—

“శారదలేని ఇల్లు ఇంత కలకలలాడుతుందని నేను అనుకోలేదు. నీ ఋణం ఎలా తీర్చుకోను, కమలం” అంటూన్న శారద భర్త!

మండుతూన్న హృదయంతో కమ్మని ఆలోచనలతో దొర్లుతున్న కమలం, శారద తల్లి రావడం చూసి దిగ్గున లేచి కూర్చుంది.

“ఎప్పుడు వచ్చావు, కమలమ్మా! పొద్దున్నే వెళదా మనుకున్నాను. నువ్వు కనబడలేదు. మా రెండో అమ్మాయిని అల్లుడికిచ్చి చేసేస్తామని నిశ్చయించా మమ్మా! పరాయి ఆడదానికి ఈ పిల్లలను అప్పగించే కన్నా, ఇలా చేస్తేనే మంచిదని అందరూ అంటున్నారు” అని చెప్పింది.

ఆవిడ మాటలు తలకెక్కేసరికి చల్లగా బారి పోయింది కమలం. ‘అవును. తను లేకపోయినంత మాత్రాన ఏ కథ ఆగుతుందీ!’ అనుకుంది, ఇసుకలో కట్టిన పిచ్చుక గూడు కూలిపోతూంటే చూస్తూన్న చిన్న పాప మొహం వేసుకుని. ★

# చరిత్ర పునాది

## ముదిగొండ శివప్రసాద్

ఆగామి అన్న భవనానికి గతం పునాది
నిన్నకు గర్విస్తేనే రేపున్నది చరిత్ర.

నిన్న మొగ్గ తొడుగనిదే రేపు మల్లె విరియునా? ‘నిత్యమల్లె’ విరియునా?
నేడు సుమము పూయనిదే, రేపు ఫలము కాయునా?
భూతకాల దీపానికి భావి వెలుగు తోడు,
భావ, భౌతికుల కిర్వురికీ ఇదే రాచబాట.

పొంగే గంగాదేవికి గంగోత్రియే మూలం
నింగి పాల వెన్నెలకు చందమామయే మూలం
కార్యానికి కారణం ఉన్నట్లయితే
జాతికిని, దేశ ప్రగతికి గత చరిత్రయే మూలం.

వెనుక చూచి నడువు మన్నదే ఋషి వాక్యం
పితౄదర్శమ్మును చూపునదే కవి వాక్యం
భూత విభూతిని కాదన్న భావి బ్రతుకు సున్న,
ఏ దేశ చరిత్రకైన అర్థ మిదేనన్నా!

ఆగామి నవ భవనానికి గతం పునాది
నిన్నకు గర్విస్తేనే రేపున్నది చరిత్ర!